# మంటలు

పోలరావు పొట్టిమనిషి అంటే అతని పెళ్ళాం అతనికంటె పొడగరి పొడుగేకాదు అతని కంటె కండలు మృదువై మూడు రెట్లుంటాయ్.

ఈ పొట్టిమనిషి పుట్టెడు ఆలోచనలు పెళ్ళయినదగ్గరనించీ పెళ్ళాంమీదే లగ్నమై వున్నాయి. ఉద్యోగంలో మంటలే అగుపిస్తుంటే హృదయంలోకూడా మంటలే రాజుకుంటున్నాయి.

ఇంకా ప్రొద్దు పడమట పకపక నవ్వుతున్నట్లే వుంది. పెద్ద మార్షలింగ్ యార్డులో గూడ్సుబండి ఆగింది. దక్షిణవేపు బయలు ప్రదేశంలో భూమిని ముద్దెట్టుకోబోతున్నట్లు పూరిపాకలు. రైలుకమ్ములప్రక్కనే నెత్తిమీద ఎత్తుగా కబంధుడి కన్నులా యింకా వెలగని దీపం. పెళ్ళాందగ్గర గజగజవణికే గొంతు కేదో యిక్కడ వీరావేశంతో మైకుఎదుట అరుస్తూ లౌడ్‌స్పీకర్లు బ్రద్దలయ్యేటట్లు రైళ్ళ కదలికను కంట్రోల్ చేస్తోంది. ఇంజనులో పోలరావు ప్రక్కనేవున్న డ్రైవరు తమ్మయ్య మెల్లగా జారి పాకలవేపు పోయాడు.

మైకులో కసితీరా తిట్టున్నట్లు అరుపులు, రైళ్ళకూత - ఒంటరిగావున్న ఫైర్‌మన్ పోలరావుకు యివేవీ వినిపించలేదు. కళ్ళ ఎదుట తను వుంటున్న యిల్లు. అది నాలుగిళ్ళ చావిడి. ఒక యింట్లో తన భార్య ఒక్కతే. వయసులో

వాలుచూపులతో వుయ్యాలలూగుతున్న వంపులేని సుందరి. వెన్నెల వెలుగులా వుంది. లేచిన కెరటంలా కోరికల నురగలను మోసుకుంటూ వులికిపోతోంది. ఆమె చూపుల్లోనే ప్రేమ పిలుపుంది. మౌనంలోనే కోరికల ఏర్లు పొంగి పోతుంటాయి.

సోలారావు నెమ్మదైనవాడు పట్నంలో పుట్టి పెరిగాడు. సభ్యతలు తెలుసు. మంచిని గౌరవిస్తాడు. చెడుగంటే గొప్పభయం. నీతిని బోధించే పురాణాలను ఆరాధిస్తాడు. ఒకరి వ్యవహారాల్లో జోక్యం చేసుకోవటం సుతరాం యిష్టంలేదు. తన మానాన తను బ్రతకాలని తాపత్రయపడే మనిషి. తెలుపంటే యిష్టం. తన తెల్లని పెళ్ళాం అంటే మరీ యిష్టం.

అలాంటి వానికి యెలాంటి పెళ్ళాం వచ్చిందో చూడండి. బుల్లెమ్మ పల్లె టూరిది. పల్లెటూర్లో వున్నప్పుడు గాడీ నైలాన్ చీరలు కట్టేది.

పట్నానికి సినిమాకి యెగబడేది. వాటిలో నాయికను నలిపివేసే నాయకు డంటే పడిఛస్తుంది. సంపంగి పూవులంటే బాగా యిష్టం. ఘాటు సెంటు, తలకి ఘాటు వాసన నూనె వుండి తీరాలి. పెదాలకి రంగు రాయాలని వున్నా యింకా తెగించలేదు. పట్నం వచ్చాక వీటిపై మోజు వెర్రిగా పరిణమించింది. ఆమెకు య్రెర్ర చీరలమీద మోజు, నల్ల జాకెట్లంటే యిష్టం. పొడుగైన జుంకాలు, దళసరి గాజులు - మెడలో పది తులాల బంగారు గొలుసుంది.

ఇక ఆమె బుగ్గలు పెద్దవి. చేతివ్రేళ్లు పొడవైనా బొద్దుగా ఉంటాయి. మెడ పొట్టి అయినా మెడక్రిందుగా శరీరం జిగజిగ మెరుస్తుంటుంది. కాస్త బరువైన మనిషైనా సునాయాసంగా కదులుతుంది. కదిలేటప్పుడు. కళ్ళు చుట్టూ తనవేపు యెవరైనా చూసి మెచ్చుకుంటున్నారో లేదో అని వెతుకుతూ కదులు తాయి. ఆమె చాలా అందమైందని, మగవాళ్ళు ఆడదాని దగ్గర కాంక్షించినవన్నీ ఆమె దగ్గర కోకొల్లలుగా వున్నాయని ఆమెకు చాలా గర్వం.

ఇలాంటి బుల్లెమ్మను ఒంటరిగా వారానికి అధమం నాలుగు రాత్రులైనా తను ఎలా విడిచిపెట్టగలుగుతున్నాడు? అందులో ఆ లోగిల్లో తనకంటె పొడగరి- ఉంగరాలజుత్తును మరిమరీ నొక్కులుచేసి నల్లనాగుల్లా వదిలే అంద గాడు, ఆడది కాంక్షించినవన్నీ భద్రపరచుకున్నవాడు, కళ్ళను కళ్ళాలు చేసు కొనగలిగేవాడు, పెదాలపై వెలిగించే నవ్వునే అమృతంగా విరజల్లగలిగేవాడు, మగువల హృదయాలను మౌనంగా గిలిగింతలు పెట్టగలిగే నేర్పరి - మరెవరో కాడు - ఆ సుందర్రావు, పేరుకుతగ్గ సుందరుడు పెన్షిధిలా వయసును యెల్ల వేళల పరాయి స్త్రీలకోసం పెళ్ళి చేసుకోకుండా రక్షించుకునే చతురుడు.

ఆ నాలుగిల్ల చావిడిలో తన పొరుగునే వుంటున్నాడు. ఎగసి ఎగసి పోతున్నాడు. వెళ్లైత్తి యెప్పుడో ఒక రాత్రి తన గదిలో దూరిపోతాడు. తప్పదు.

తను లేని గది. ఉన్నా ఆయాసంతో నిద్రపోతున్న తను - తనంటే అసహ్యంతో నున్న పెళ్ళాం - బాహువులు బాహాటంగా విప్పి అతనిని బంధించుకోలేదా?

అతను యిచ్చిన రామాయణ భాగవతాలు, పతివ్రతల కథలు, అన్నీ బుల్లెమ్మ చదవకండా సెక్సుపుస్తకాలు, సంచికలు తెప్పించుకొని చదువుతోంది. తనకిష్టమైన తెల్లచీరలు కట్టకండా ఒళ్ళు కనిపించే నైలాను చీరలు కట్టుంది. తన కిష్టంలేని ఘాటు సెంటు రాసుకుని వున్న కొద్ది రాత్రులూ వూపిరిసలపకండా బయట పడుకునేటట్లు చేస్తోంది. తనకిష్టమైనవి ఆమెకిష్టంలేదు. తను చెప్పింది ఆమెకు నచ్చదు. ఎల్లప్పుడూ యింట్లో కూర్చుంటే మగవాడికెలా జరుగుతుంది. సంసారం యెలా సాగుతుంది? తనకే డబ్బుంటే. భార్యను ఒంటి స్తంభం మేడలో పెట్టి-గేటు దగ్గర తుపాకీతో ఘూర్ఖావాడిని కాపలా పెట్టి-పోనీ, వేగంగా క్వార్టర్సు వచ్చినా బాగుండేది. ఎలకని మట్టిలో కప్పినా బైటకు వస్తుంది. పెళ్ళాన్ని తనెక్కడ దాచినా లాభమేమిటి? ఎవరినీతి వాళ్ళదగ్గరుండాలి. నీతితప్పటం తన కళ్ళపడాలి! ఆమే తనూ ఒక్కసారే బలవంతాన చావడం తప్పదు. ఏడీ తమ్మయ్య? తాగడానికి ఆ పాకలోనికి వెళ్ళాడు జగాన్ని-చూస్తున్న సూర్యుడు మేఘాల్లోనికి దిగజారినట్లు - ఒకనాడు యెంత మంచివాడు వీడు? యిప్పుడెలా దిగజారిపోయాడు?ఆ పాకల్లో తాగి అక్కడే ఆడది,కనుసైగల్లో కదిలి అమృతం తాగినట్టు తేన్పుకుంటూ వస్తాడు.

మబ్బుల ఆవల దాగున్న చీకటి ముంచుకుని ప్రవాహంలా రాకముందే స్తంభం మీదనున్న నీలిదీపం వెలిగింది. ఆ కిరణాలను బాణాలా వదిలి చీకటి సైన్యాన్ని ఆ చుట్టుపట్లకు రాకుండా ఆపింది. చింతతో ప్రాణాలు తీయబోవాలని గుండెను బ్రద్దలు చేసుకుంటున్న పోలరావు ఉత్తరంవేపు చూశాడు.

ఇద్దరాడవాళ్ళు ఒక్కొక్కరూ కాస్తదూరంలో వున్నారు. ఒకత్తై కాస్త వయసు మళ్ళినది. రెండోది మాంచి వయసులోవున్నా వయసుపై నల్లని ముసుగు కప్పినట్లుంది. వాళ్ళ కడుపులు అంటుకుని ఉన్నాయి. వెముకలు వంగినప్పుడు స్పష్టంగా కనిపిస్తున్నాయి. చిరిగిన వస్త్రాలు విరిగిన వంపులను ఘోరంగా చూపిస్తున్నాయి. బొగ్గు నలుపంతా వాళ్ళ శరీరమంతా పులిమినట్లుంది. పాదాలు అట్లల్లా వున్నాయి. పెదిమలు యెండి బిరుసుగా వున్నాయి. ఉమ్మి ఊరుతోంది. ఆ వుమ్మి నోటిలో ఒక తినే పదార్థం పడివుంటే రుచిగా వుండేది. అలాంటిది లేకపోవటంతో పట్టాలపై కదులుతూ బొగ్గులేరుతూ పూసుకుంటున్నారు. ఊర్వశులు కాదగ్గ ప్రాణులు: యేదో మూగబాధకులోనై వంకరగాడిదలయ్యారు. వేగిపోయిన మనసులతో, కరిగిపోయిన కలలతో, చివికిపోయిన గుండెలతో, గుప్పెట్లో పెట్టుకున్న ప్రాణాలతో, కాలిన బొగ్గునించి వెలచగలిగే బొగ్గు

ముక్కలను యేరుకుంటున్నారు. ఏరుకుంటూ ఒకచోట కలిశారు. ఒక కుప్పపై యిద్దరూ పడ్డారు. ఒకరిచేతులు యింకొకరిచేతులు దగ్గరయ్యాయి.

అలా ఒకే బొగ్గుముక్కమీద యిద్దరి చేతులూ ఒక్కసారి పడ్డాయి. ఇద్దరూ నాదంటే నాదని ఆ బొగ్గుముక్క గురించి పోట్లాడుకుంటున్నారు. అది కాస్త పెద్దబొగ్గుముక్క. కాలనిదే. అలాంటివి ఒక బుట్టకైతే అమ్మితే వాళ్ళకో రూపాయి యిస్తుందేమో? ఆ బొగ్గుముక్క కోసం యిద్దరూ పోరాటానికి లంఘించు కున్నారు. ముందు గట్టిగా అరుచుకున్నారు. లాగుకున్నారు, తోసుకున్నారు! ఆ బొగ్గుముక్క వయసులో వున్నదానిచేతిలో వుండిపోయింది. రెండోదానికి బలవంతంగా తీసుకునే శక్తిలేక రంకునంతా యెత్తుతోంది. ఎవరెవరితో పోయిందో యెప్పుడెప్పుడు పోయిందో వివరంగా స్పీకరు కూడా పనికిరానంతగా గట్టిగా అరుస్తోంది. అవతలిది తక్కువ చదువుకోలేదు. ఆమె అవతలిది ఈ భాగోతం జరిపించుకోడానికి మొగుడు అడ్డువున్నాడని వాడికి విషం యిచ్చి చంపినట్లు ఆరోపణ చేసింది. ఇంక అది సవాలు చెయ్యకపోతే రుజువువై పోదూ? ఆ సవాలు యిలా అలా చెయ్యలేదు. ఆమె మహాకాళియై ఆ వయసులో నున్న దానిమీదపడింది. ఇక భీషణసంగ్రామం. ఆ యెముకల్లోనున్న సత్తువంతా పిండి పిండి యుద్ధం చేస్తున్నారు. ఎముకలు పిప్పి అయి పోతున్నాయి చర్మాలు రక్కులతోవున్న కాసిన్ని రక్తంబొట్లు చిమ్మిస్తున్నాయ్.

ఈ పోరాటం సరిగ్గా రైలు లైను మీద యార్డులో. బళ్ళు కదులుతున్నయ్. ఇంజను గోలచేసినా ఈ ఆడాళ్ళు కదల్లేదు. ఒక్కసారి గూడ్సుబండి చాటునుంచి ఒక లైటు యింజను వచ్చింది.

పోలరావు ఒకసారి కళ్ళు మూసుకున్నాడు అలా మూసుకుంటూనే అతనే చచ్చినట్లు అరిచాడు. కళ్ళు తెరిచేసరికి తన యింజను దగ్గర ఒకత్తె పడివుంది. ఆమెకు కాలు తెగిపడినట్లు తనకళ్ళు భ్రమపడ్డాయి. గబగబ యింజను దిగాడు. ఆమె తలకు రాళ్ళు తగిలి రక్తం చిమ్ముతోంది. ఒళ్ళంతా చూశాడు. చర్మాల సంచులలో దాచిన ఎముకల్లావున్న పాదాలను పట్టుకున్నాడు. హమ్మయ్య-ఎలాగో బతికింది. ఇంజను ఒరిగిపోయింది. ఇంకో స్త్రీ అట్టుపక్క పడివుంది. పోలరావు ఈమెను లేవనెత్తి అటువేపు వెళ్లాడు. ఆమె ఆయాసపడ్తున్నా గబగబలేచి బుట్టనుంచి పడిన బొగ్గులను యెత్తుకుంటోంది. కాలిన బొగ్గు ముక్కకోసం ప్రాణాలు మీదికి తెచ్చుకున్న వాళ్ళయిద్దరివైపు చూస్తుంటే పోలరావుకు వాళ్ళ యిద్దరిపై యెక్కడలేని కోపం వచ్చింది, పాతకోతనంతా కెలుకుతూ కొట్లాడు కున్నవాళ్ళు పశువులకంటె కనాకష్టంగా కనిపించారు.

గబగబ మళ్ళీ యింజ నెక్కాడు. వాళ్ళ యుద్ధం మళ్ళీ చూడదలుచుకో లేదు. పొమ్మని కేకలు వేశాడు.

స్థంభంమీద దీపం వెలుగుతున్నట్లు క్రింద నీలి ముఖమల్‌లా వెలుగుతున్న కాంతి చెప్తోంది. ఆ కాంతిలో బొగ్గులు బొగ్గుల్లానే వున్నాయి. పట్టాలు పట్టాలులానే వున్నాయి. ఇంజను నల్లగా యింజనులానే వుంది. కాంతులు మారినా కళలు మారలేదు.

రెండో ప్రక్కనుంచి తమ్మయ్య యింజ నెక్కాడు. "ఇంకా యెంతసేపో ఈ కొలువు"అంటూ వాడ్ని చూసి పోలరావు విసుక్కుంటూ అన్నాడు. తమ్మయ్య యింజనులో ఒకసారి ప్రదక్షిణచేసి చూశాడు.

"అవునుమరి. పనిచెయ్యకండావుంటే విసుగ్గా వుండదా? ఎయ్యి యేగం - యెయ్యి - ఫైర్‌మన్‌వి బొగ్గెయ్యి - స్టీమెక్కుతాది - ఈ బరువుతో గూడ్సుబండి కదుల్తాది.''

పోలరావు పారపట్టుకున్నాడు. మంటలు, ఆ మంటల్లోనికి బొగ్గువిసిరాడు. ఆ మంటల్లో యింకెన్నో మంటలు కన్పిస్తున్నాయి. కామపు మంటలు - ఆకలి మంటలు - ఎందరెందరో - ఎన్నో లక్షలు-కోట్లు - మంటల్లో మండుకపోతున్న మానవాళంతా కనిపించినట్లనిపించింది.

తమ్మయ్య ఒక్కసారి మంటలవేపు చూసి—

"మంటలు....యింకా మండనీ .... వెయ్యి .... యింకా బొగ్గువెయ్యి .... పిచ్చోడా! మనిషిబతుకే మంటలు .... ఆ మంటలు ఆరితే.... బుగ్గేమిగులు.... వెయ్యి.... యింకా బొగ్గెయ్యి" అన్నాడు.

పోలరావు బొగ్గువేస్తుంటే బుల్లెమ్మే ఆ మంటల్లో కనిపించింది. ఒకసారి ఆగి ఆ మంటలకు తగ్గట్లు తను బొగ్గు వెయ్యాలని భీష్మించుకున్నాడు. *

(1968)